ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 25 ఫిబ్రవరి 2024



55 ఏళ్లు నిండిన టీచర్లను మినహాయించాలి

● ఏపీటీఎఫ్ డిమాండ్

బెలగాం, ఫిబ్రవరి 24: జిల్లాలో 55 ఏళ్లు వయసు పైబడిన ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు ఎం.మహేష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 55 ఏళ్ల నిండిన టీచర్లు అధిక శాతం అనారోగ్యానికి గురైన వారు ఉంటారని, ఎన్నికల విధులు నిర్వహించడం కష్టంగా ఉంటుందని వెల్లడించారు. గర్భిణులు, బాలింత ఉపాధ్యాయురాళ్లను కూడా ఎన్ని కల విధుల్లోంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వం, ఉన్నతాధి కారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

తొలి జాబితాలో ముగ్గురు

● జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఖరారు ● పేర్లు వెల్లడించిన పార్టీ అధినేత చంద్రబాబు
● పాలకొండ అభ్యర్థిని ప్రకటించని అధిష్ఠానం
● పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని శ్రేణులకు నేతల పిలుపు

పార్వతీపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి)

జిల్లా నుంచి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను టీడీపీ అధిష్ఠానం విడుదల చేసింది. ఈ మేరకు శనివారం టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఒకే వేదికపై అభ్యర్థుల పేర్లు ప్రకటించారు.

తొలి జాబితాలో 'మన్యం'కు సంబంధించి పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాలకు చెందిన టీడీపీ అభ్యర్థుల పేర్లు వెల్లడిం చారు. పాలకొండకు సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థి పేరును ప్రకటించాల్సి ఉంది. కాగా గెలుపు గుర్రాలకే టిక్కెట్లు దక్కడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో టీడీపీ తరపున ఎన్నికల బరిలోకి దిగనున్న అభ్యర్థుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



● పార్వతీపురం నుంచి విజయచంద్ర..

పార్వతీపురం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర స్వస్థలం ప్వాతీపురం మండలం నర్సిపురం. ఆయన మొదటిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. బీటెక్ పూర్తిచేసిన తర్వాత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఉండే వారు. అదే సమయంలో టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు దగ్గరగా ఉంటూ అయన ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టారు. ఆయన సేవలను గుర్తించిన చంద్రబాబు సుమారు ఆరునెలల కిందట పార్వతీపురం నియోజకవర్గ బాధ్యతలను అప్పగించారు. పార్వతీపురంలో జరిగిన బహిరంగసభలో విజయచంద్ర పేరును ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని.. ఆయన్ని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. దీంతో అప్పటినుంచి విజయచంద్ర నియోజకవర్గంలో టీడీపీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయాలనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.



● సాలూరు అభ్యర్థిగా సంధ్యారాణి..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా పనిచేసిన గుమ్మిడి సంధ్యారాణి రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. ఆమె తండ్రి జన్ని ముత్యాలు గతంలో సాలూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. 1999లో సంధ్యారాణి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. 2004 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఐసీడీఎస్ విశాఖ రీజనల్ చైర్మన్‌గా పనిచేశారు. 2009లో టీడీపీ నుంచి పోటీ చేశారు. 2014లో టీడీపీ ఎమ్మెల్సీగా పనిచేసి నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా ఉన్నారు. కొద్దిరోజుల కిందట వరకు అరకు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. 2014లో టీడీపీ తరపున అరకు ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగారు.



● కురుపాం నుంచి జగదీశ్వరి..

టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తోయక జగదీశ్వరి మొదటిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఆమె స్వస్థలం గుమ్మలక్ష్మీపురం మండలం కొండవాడ. ప్రస్తుతం ఆమె అత్తవారు గ్రామం తాడికొండలో ఉంటున్నారు. జగదీశ్వరి భర్త సూర్యనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన తాత అడ్డాకుల లక్ష్మీనాయుడు 1950-57 వరకు పార్వతీపురం ఎమ్మెల్యేగా పనిచేశారు. పెదనాన్న గుండు నాయుడు సమితి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆ కుటుంబం నుంచి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా పనిచేశారు. ప్రస్తుతం అదే కుటుంబా నికి చెందిన జగదీశ్వరి టీడీపీ నుంచి కురుపాం ఎమ్మెల్యేగా పోటీ చేయ నున్నారు. ఆమె బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశారు. విద్యావంతురాలైన జగదీశ్వరి గతంలో తాడికొండ, ఎల్విన్‌పేట ఎంపీటీసీగా పనిచేశారు. రెండేళ్ల కిందట టీడీపీ అధినేత చంద్రబాబు కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను జగదీశ్వరికి అప్పగించారు. అప్పటి నుంచి ఆమె నియోజక వర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకుని వెళ్తూ.. పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

ఆనందంగా ఉంది..

టీడీపీ అధిష్ఠానం ప్రకటించిన తొలి జాబితాలో నా పేరు ఉండడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నా. తనపై అధినేత ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా కష్టపడి పనిచేస్తా. టీడీపీ- జనసేన పార్టీ శ్రేణులు, ప్రజల సహకారంతో పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తాం. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.

-బోనెల విజయచంద్ర, టీడీపీ పార్వతీపురం అభ్యర్థి

వైసీపీని ఓడిస్తాం..

కొద్ది రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో సాలూరులో వైసీపీని కచ్చితంగా ఓడిస్తాం. ప్రజలు, కార్యకర్తలే నా బలం, బలగం. దుర్మార్గపాలనకు తెరదించుతాం. సాలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది చంద్రబాబు, పవన్‌కు బహుమతిగా అందిస్తాం. సాలూరులో విజయం సాధించి టీడీపీ జెండా ఎగురవేస్తాం.

-గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ సాలూరు అభ్యర్థి

టీడీపీ జెండా ఎగురవేస్తాం..

గిరిజన నియోజకవర్గం నుంచి నాకు టికెట్ కేటాయించిన చంద్రబాబుకు రుణపడి ఉంటా. కురుపాంలో టీడీపీ జెండా ఎగురవేస్తాం. చంద్రబాబును సీఎంను చేయడమే లక్ష్యంగా పనిచేస్తాం. నియోజకవర్గంలోని తోటి నాయకులు, కార్యకర్తలు, పెద్దల సహకారంతో ఎన్నికల బరిలోకి విజయం సాధిస్తా.

-తోయక జగదీశ్వరి, టీడీపీ కురుపాం అభ్యర్థి

టీడీపీ శ్రేణుల్లో జోష్

● జిల్లావ్యాప్తంగా సంబరాలు ● కార్యకర్తలు, నాయకుల సందడి ● నూతనోత్సాహంతో ముందుకు..

పార్వతీపురం/ రూరల్/ బెలగాం/గుమ్మలక్ష్మీపురం సాలూరు/రూరల్, ఫిబ్రవరి 24: టీడీపీ అధిష్ఠానం తొలి జాబితాలో మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను ప్రకటించడంతో ఆయా ప్రాంతాల్లో శనివారం పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నాయి. తెలుగుదేశం పార్టీ కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసుకుని ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. మరోవైపు నియోజకవర్గ ఇన్‌చార్జిలతో పాటు నాయకులు, కార్యకర్తలు ర్యాలీలతో సందడి చేశారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని.. జిల్లావ్యాప్తంగా టీడీపీ జెండా ఎగురవేసి, పార్టీ అధినేత చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాలని శ్రేణులకు ఎమ్మెల్యే అభ్యర్థులు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. జిల్లాకేంద్రం పార్వతీపురంలో కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. టీడీపీ కార్యాలయం వద్ద పండగ వాతావరణం నెలకొంది. శ్రేణులు భారీగా అక్కడకు చేరుకుని టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్రకు అభినందనలు తెలియజేశాయి. అనంతరం విజయచంద్ర ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి నర్సిపురం వరకు, తిరిగి అక్కడి నుంచి పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీతారాం, నారాయణరావు, చంటి, రవికుమార్, వెంకటేష్, పి.సత్యనారాయణ, మధుసూదన్‌రావు, దేవి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

● గుమ్మలక్ష్మీపురం భద్రగిరిలో టీడీపీ కురుపాం అభ్యర్థి జగదీశ్వరి నివాసం కార్యకర్తలు, నాయకులతో కోలాహలంగా మారింది. టీడీపీ శ్రేణులు ఆమెకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, నాయకులు కోల రంజిత్, జోగి భుజంగరావు, రాంబాబు తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

● టీడీపీ నుంచి సాలూరు అసెంబ్లీ టిక్కెట్ ఎవరికి దక్కుతుందోననే ఉత్కంఠకు అధిష్ఠానం తెర దించింది. తొలి విడత జాబితాలో సాలూరు అభ్యర్థిగా పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి పేరును ప్రకటించడంతో శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సాలూరు పట్టణ, రూరల్, పాచిపెంట, మక్కువ పార్టీ అధ్యక్షులు తిరుపతిరావు, పరమేశు, ప్రసాద్‌బాబు, వేణుగోపాలరావు, శ్రేణులు ఆమె ఇంటికి వెళ్లి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆమె టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్ ఇంటికి వెళ్లి ఈ విషయం చెప్పారు.



పార్వతీపురంలో టీడీపీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న విజయచంద్ర





సాలూరు, భద్రగిరిలో టీడీపీ అభ్యర్థులు సంధ్యారాణి, జగదీశ్వరికి స్వీట్లు తినిపిస్తున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు

నోటీసుల పర్వం

● 'చలో విజయవాడ'కు వెళ్లరాదని సంఘాల నాయకులకు పోలీసుల హెచ్చరిక

పార్వతీపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు శనివారం పోలీసులు నోటీసులు అందించారు. ఈనెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తే.. చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిలో భాగంగా ఏపీ ఎన్జీవో సంఘ నాయకుడు జీవీఆర్ కిషోర్‌కు ఇంటికి వెళ్లి పార్వతీపురం పట్టణ ఎస్ఐ సంతోషి నోటీసు అందించారు. అయితే దీనిపై ఆయన మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులతో పాటు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేపట్టాలనుకోవడం తప్పా? అని ప్రశ్నించారు. ఉద్యమాన్ని అణిచివేసే విధంగా సర్కారు వ్యవహరించడం దారుణమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నోటీసులకు భయపడేది లేదన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో పోరాటాలను అడ్డుకోలేరని చెప్పారు. ఏదేమైనా 'చలో విజయవాడ' విజయవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సర్కారు దిగొచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని వెల్లడించారు. కాగా సర్కారు చర్యలపై జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు.



ఏపీ ఎన్జీవో సంఘ నాయకుడికి నోటీసు అందిస్తున్న ఎస్ఐ

పోలింగ్ శాతం పెంచాలి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు

పార్వతీపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ 80 శాతానికి పెంచాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తెలి పారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమం రాయబారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించా లన్నారు. ఓటర్లలో చైతన్యం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి ఎ.రాజశేఖరరెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో కాలేజీల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, ఉపాధ్యా యులు, వివిధ శాఖల్లో పనిచేసే క్యాంపస్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సత్యం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధపడాలి

● సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ
● బొబ్బిలిలో కోర్టు భవన సముదాయానికి శంకుస్థాపన

బొబ్బిలి, ఫిబ్రవరి 24: సత్యం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధపడాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ అన్నారు. బొబ్బిలిలో రూ.3.20 కోట్లతో నిర్మించనున్న నాలుగు కోర్టుల భవన సముదాయానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఓ రెసిడెన్సీలో అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మ సంస్థాపన చేసే యజ్ఞశాలే కోర్టు ప్రాంగణమని తెలిపారు. ఈ కోర్టు కాంప్లెక్స్‌ను ఆనుకొని న్యాయవాదులకు మంచి సదుపాయాలతో కూడిన వసతులు కల్పించాలని అక్కడే ఉన్న అడ్వకేట్ జనరల్‌కు సూచించారు. పౌరుషానికి మారుపేరుగా బొబ్బిలి నిలుస్తుందని, ఈ రోజుల్లో అధర్మంపై మాత్రమే పౌరుషం ఉండాలని తెలిపారు. వృత్తిపై నిబద్ధత ఉండాలన్నారు. జ్యుడిషియల్ ఇండిపెండెన్స్ ఎంత గొప్పదో, ప్రొఫెషనల్ ఇండిపెండెన్స్ కూడా అంతే గొప్పదన్నారు. నేటి పరిస్థితులను పరిశీలిస్తే న్యాయవాదులు బలహీనులవుతున్నారా? అనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికాంశాలు, ఆశ లాంటివి ఇందుకు కారణమన్నారు. పదవి ఉంటే తమకు లాభదాయకమేమో అనుకోవడం కూడా ఒక కారణం కావచ్చన్నారు. బార్ సమష్టిగా ఉండాలని, విడిపోతే చాలా చాలా నష్టమని తెలిపారు. హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ .. దిగువ, పై స్థాయి కోర్టులు అన్న భావన ఉండరాదని, అన్ని కోర్టులు సమానమేనన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు గ్రామీణ ప్రాంతాలకు ఇలా రావడం శుభపరిణామమని తెలిపారు.



శిలాఫలకం ఆవిష్కరణలో సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ శ్రీనరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

● ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

పార్వతీపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. వారి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల్లో నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు చాలా కీలకమన్నారు. నిబంధనలు ప్రకారం పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ వద్ద ఉంచుకొనే డబ్బు, బంగారం పరిమితి గురించి తెలుసుకోవాలని, ప్రలోభాలకు గురిచేసే వస్తువులు, రవాణా వంటివి అరికట్టడంలో బాధ్యతగా వ్యవహరించాలని ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు.

విధులపై అలసత్వం వహించొద్దు

● డీఎంవో జగన్మోహనరావు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 : విధులపై వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) జగన్మోహనరావు హెచ్చరించారు. శనివారం మండలంలో పలు సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న నిర్ధారణ పరీక్షల రికార్డులను పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు అవసరమైన మందులను సరఫరా చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. ప్లాస్టిక్, తదితర సామగ్రి రహదారులతో పాటు కాలువల్లో వేయకుండా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నట్లయితే పరీక్షలు జరిపి మందులు అందించాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల పై సర్వే నిర్వహించి తగు చర్యలు చేపట్టాలని సూచించారు.

వైభవంగా చక్రతీర్థ స్నానం

● తోటపల్లిలో ముగిసిన కల్యాణ మహోత్సవాలు ● వెంకన్నకు ప్రత్యేక పూజలు



స్వామివారికి చక్రతీర్థ స్నానం చేస్తున్న అర్చకులు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 : ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల్లో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆఖరి రోజు పవిత్ర నాగావళి నదీ తీర ప్రాంతంలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు చూర్ణోత్సవం, చక్రతీర్థ స్నానం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో నిత్యా రాధన, విశేష హోమాలు, మంగళ శాసనములుతో పాటు పలు పూజలను అర్చకులు వీవీ అప్పలాచార్యులు, వీవీ శశిధర్, ఎం.గోవర్ధన్ చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పల్లకిలో తిరువీధి మహోత్సవం నిర్వహించి తదుపరి నాగావళి నదీ తీర ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. చక్రతీర్థ స్నానం కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని పులకించిపోయారు. ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో వీవీ సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ ఎం.సత్యనారాయ ణతో పాటు సభ్యులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొత్తంగా నదీ తీర ప్రాంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చికిత్సపొందుతూ మహిళ మృతి

బొబ్బిలి: కొండదేవుపల్లి- కమ్మవలస రోడ్డులో ఈనెల 20నఆటో ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన పాకినవలస లక్ష్మి(30)చికిత్స పొందుతూ విజయనగరంలో శనివారం మృతిచెందింది. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ కథనం మేరకు..కమ్మవలస గ్రామానికి చెందిన లక్ష్మి భర్త తవిటినాయుడుతో ఈనెల 20న భీష్మాఏకాదశి పూజలకోసం కొండదేవుపల్లికి బైకుపైవెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదాన్ని గమనించిన లక్ష్మి ముందగానే బైకుపైనుంచి దూకడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను బొబ్బిలి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్సకోసం విజయనగరం తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. లక్ష్మి మృతిచెందడంతో భర్త తవిటినాయుడు కలత చెంది ఇంటి నుంచి ఎటోవెళ్లిపోయాడు. వారికి యశ్వంత్, జస్వంత్ ఇద్దరు కుమారులు ఉన్నారు.ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకరరావు

బొండపల్లి: మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో శుక్రవారం సంచలనం సృష్టించిన జంట హత్య కేసులో ముద్దాయిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజపతినగరం సీఐ ఎస్‌వి.ప్రభాకరరావు తెలిపారు. ఆయన శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో హత్యకు గల కారణాలను వివరించారు.ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. నిందితుడు డోల లక్ష్మణరావుకు, తండ్రి రాము, సవతి తల్లి జయలక్ష్మిలకు మధ్య గత 8 సంవత్సరాలుగా కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో లక్ష్మణరావు శుక్రవారం ఉదయం బట్టలు ఉతుకుతుండగా మురుగునీరు తమ ఇంటి వైపు ఎందుకు వచ్చిందని సవతి తల్లి జయలక్ష్మి.. లక్ష్మణరావుతో గొడవ పడింది. ఆవేశానికి లోనైన లక్ష్మణరావు కత్తితో ఉదయం 11 గంటల సమయంలో సవతితల్లి జయలక్ష్మిని, తండ్రి రాముపై దాడిచేసి విచక్షణా రహితంగా నరికేశాడు. దీంతో వారు అక్కడికక్కడే మృతిచెందినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడయ్యింది. గ్రామ వీఆర్వో బి.రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమగ్ర విచారణ జరిపి, లక్ష్మణరావును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: కందిశలో శనివారం పోలీసులు ఎన్నికల సోదాల్లో భాగంగా నిర్వహించిన దాడుల్లో 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఓ వ్యక్తిని అరెస్టుచేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

తోటపల్లి సాగునీటిపై వాడివేడి చర్చ

రేగిడి:మండల సమావేశంలో తోటపల్లిసాగునీటిపై వాడివేడిగా చర్చజరిగింది.స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. షెడ్యూల్ ప్రాప్తికి ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సిన సమావేశం కోరం (ఏడుగురు) లేక గంటన్నరఆలస్యంగా ప్రారంభమైంది.20 మంది సభ్యులకు ఇద్దరు మృతిచెందిన విషయంవిదితమే.కోరంకోసం అవసరమైన సభ్యులు రావడంతో ఉదయం 11.30 గంటలకు ప్రారంభించారు. సమావేశంలో సభ్యులు కంటే వారి ప్రతినిధులుగా ఎక్కువమంది హాజరుకావడం విశేషం.వివిధశాఖలపై జరిగిన చర్చలో సభ్యులతోపాటు,సభ్యులుకానివారు అధికారులను నిలదీశారు. మండలంలోని ఆయకట్టుకు తోటపల్లినీరుసరిగా అందుబాటు లేకపోవడంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వారి ప్రతినిధులుగా హాజరైన వారు ప్రశ్నించారు. ప్రతి ఏడాది ఇదేసమస్య పునరావృతమవుతోందని ఏఈ వరప్రసాదరావును సభ్యులు ప్రశ్నించారు. తోటపల్లి కాలువల పరిస్థితిపై వైస్‌ఎంపీపీలు టెంకాల అచ్చంనాయుడు, జగన్మోహనరావు, కోడిశ ఎంపీటీసీ ప్రతినిధి నెల్లి పెంటన్నాయుడు ఏఈనిప్రశ్నించారు. ఈవిషయంపై ఏఈ సమాధానం చెప్పేందుకు ప్రయత్నించినా నేతలు అడ్డుతగిలారు. నిధులు లేకపోతే ఉపాధి పథకంలో భాగంగా పనులుచేయించాలని, అవసరమైతే మండలపరిషత్,పంచాయతీ తీర్మానాలు అందజేస్తామని వచ్చే ఏడాదికి నీరందిలా చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఉపాధిహామీ పథకం పనులు, సమగ్ర భూసర్వే తదితర అంశాలపై చర్చ జరిగింది. పలుశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో తహసీల్దార్ రాములమ్మ, ఏవో నాగమణి పాల్గొన్నారు.

రైతులపై వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

దాసన్నపేట:ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువల అలైన్‌మెంట్ కోరుతున్న రైతులను హేళన చేస్తూ రైతులకు ఏం తెలుసు వారేమైనా ఇంజినీర్లా అంటూ జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, రైతు సంఘ కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్‌చేశారు. శనివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ పెద్దగెడ్డ, తోటపల్లి ప్రాజెక్టు విషయంలో ముంపు గ్రామాల అంచనావేయడంలో ఇంజినీర్లు విఫలమయ్యారని ఆరోపించారు. రైతులకు ఇంజినీరింగ్ పరిజ్ఞానం లేకపోయినా జరుగుతున్న పరిణామాలను అంచనావేసి చెప్పగలిగే జ్ఞానం ఉందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువల నిర్మాణంలో ఎక్కువ మంది రైతులు భూములు కోల్పోతున్నారని, కాలువ అలైన్‌మెంట్ మార్చితే మంచిదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రిటైర్ అయిన ఉద్యోగులతో నిపుణుల కమిటీని వేసి వారిచ్చిన రిపోర్టు ప్రకారం అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు.

వర్గీకరణతో మాదిగలకు ఉద్యోగాలు

- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

బొబ్బిలి:చంద్రబాబు ఎస్సీ వర్గీక రణ చేసిన ఫలితంగా 22 నుంచి 25 వేల మంది మాదిగలు ఉద్యోగాలను సాధించగలిగారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తెలిపారు.శనివారంరాత్రి స్థానిక గంటి ప్రసాదం స్మారకభవనంలో ఏర్పాటు చేసిన మాదిగ, రెల్లిఉపకులాల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 30 ఏళ్లుగా ఆటుపోట్లను ఎదుర్కొంటూ లక్ష్యంకోసం శ్రమిస్తున్న ఎంఆర్‌పీఎస్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఓ టార్చ్‌లైటు మాదిరిగా వెలుగునిస్తున్నారన్నారు. జీర్ణించుకోలేని కొంతమంది మాల సోదరులు ఢిల్లీలోని ఏపీ భవన్ సాక్షిగా లాబీయింగ్‌చేసి వర్గీకరణను రద్దుచేయించారన్నారు. వారికి పలుకుబడి, డబ్బు ఉండడంతో సాధించుకోగలిగారన్నారు.సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీనివాసరావు, నాయకులు మాసిలామణి, పొందూరు విజయరామారావు, కిల్లా సురేంద్ర, కింతలి రాము,అప్పారావు, రేజేటి బుజ్జి, కాగాన సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ



బాడంగి: మాట్లాడుతున్న పాలవలస గౌరు



రామభద్రపురం: మాట్లాడుతున్న తిరుపతినాయుడు



విజయనగరం రూరల్: జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ బీసీ విభాగం నాయకులు

'సూపర్‌సిక్స్'తో వైసీపీలో గుబులు

- తెలుగుదేశం పార్టీ నాయకులు

చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు.శనివారం జిల్లాలో నాయకులు విలేకరులతో మాట్లాడారు.

బీసీల అభ్యున్నతే లక్ష్యం

విజయనగరం రూరల్: బీసీల అభ్యున్నతేటీడీపీ లక్ష్యమని ఆ పార్టీ టీడీపీ బీసీ నాయకులు కంది మురళీనాయుడు, కోండ్రు శ్రీనివాసరావు చెప్పారు. శనివారం విజయనగరం నగర పాలక సంస్థలోగల 1, 2, 3, 4 డివిజన్ల పరిధిలోని ఫూల్‌బాగ్‌లో జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా బీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదేళ్లలో ఈ ప్రభుత్వం బీసీలకు ఏమి చేయలేకపోయిందన్నారు. బీసీల కోసం గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన పథకాలను ఎత్తివేసి, బీసీలకు అన్యాయం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలు టీడీపీ-జనసేన కూటమికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ బీసీ విభాగం నాయకులు రొంగలి రామారావు, మామిడి దేవేంద్రనాథ్, వేచలపు శ్రీను, గడి శ్రీను, మాజీ కౌన్సిలర్లు కిల్లాన మహేశ్వరరావు, కిల్లాన పార్వతీ, వెలిచేటి మణికుమారి, టీడీపీ నాయకులు వేలిచేటి బాబురావు, ప్రసాద్, రొబ్బి వరలక్ష్మీ, గండ్రేటి సన్యాసిరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

రామభద్రపురం: మహిళలు, యువత, రైతులు అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు తెలిపారు. మండలంలోని బూసాయవలసలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడానికి ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారని తెలిపారు. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా శనివారం బేబీనాయను ప్రకటిం చడంపై హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రాజులు పార్టీలకతీతంగా సొంత నిధులతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. బేబీనాయన విజయం ఎప్పుడో ఖాయమైపోయిందని, మెజార్టీ కోసమే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో మడక పాపారావు, మడక సత్యం పాల్గొన్నారు.

రానున్న 50 రోజులు కష్టపడాలి..

బాడంగి: బొబ్బిలి నియోజకవర్గానికి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయనను ప్రకటించడం హర్షనీ యమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర జనరల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎరువుల పాకలో విలేకరులతో మాటా మాట్లాడుతూ బేబీనాయన విజయం నల్లేరుపై నడకేనని, ఈసారి 15 నుంచి 20 వేల మెజార్టీతో టీడీపీ జెండాను బొబ్బిలి కోటపై ఎగురవేయడం తథ్యమని తెలిపారు. అభ్యర్థి ఖరారుకావడంతో గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయం కోసం రానున్న 50 రోజులు కష్టపడాలని కొల్లి అప్పలనాయుడు, పాలవలస గౌరులు కోరారు. బేబీనాయనకు టిక్కెట్టు రావడం మంచి శుభపరిణామమని పార్టీ మండలాధ్యక్షుడు తెంటు రవిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చారు. కాగా విజయనగరం జిల్లా పార్లమెంట్ కొప్పలవెలమ బీసీ సాధికారిత కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: కోండ్రు మురళీమోహన్

రాజాం రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానని రాజాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ స్పష్టం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రకటించిన తొలిజాబితాలో టికెట్ పొందిన కోండ్రుతో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. చంద్రబాబు నోటి వెంట నాపేరు వినడం చాలా సంతోషంగా ఉందని, బాధ్యతగా పనిచేసి అందర్నీ కలుపుకుని పనిచేస్తానని తెలిపారు. రాజాంలో విజయం సాధించి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తానన్నారు. నియోజకవర్గంలో టీడీపీ గాలి వీస్తోందని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు తమ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికార పార్టీ వైఫల్యాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. తాను గతంలో మంత్రిగా నియోజకవర్గానికి సుమారు రూ.500 కోట్లు నిధులు మంజూరు చేయించానని, తాగునీటి ఎద్దడి లేకుండా రక్షిత మంచినీటి పథకాలు, రహదారుల నిర్మించానరి సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చానని చెప్పారు. అధికార పార్టీ మాయమాటలు నమ్మి మరోమారు మోసపోవద్దని కోరారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ టీడీపీతోనే చేరుతాయని తెలిపారు.



రేగిడి: సంకిలిలో కోండ్రును అభినందిస్తున్న మండల టీడీపీ నాయకులు

సంకిలిలో కోండ్రుకు అభినందన

రేగిడి: రాజాం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ కోండ్రు మురళీ మోహన్‌కు లభించడంతో శనివారం సంకిలిలో పార్టీ నాయకులు, గ్రామస్థులు అభినందించారు. పాలకొండ దుర్గమాతను దర్శించుకొని రాజాం వెళ్తుండగా మార్గమధ్యలో ఆయనతో దూబ ధర్మారావు, అశోక్‌బాబు, జి. ధనంజయ్, గురవాన రమేష్, నాగభూషనరావు, సంకిలిక్యాడర్ కర్రి రమణ, గంగు కృష్ణారావు, నక్క రమణ మాట్లాడారు.

వేణుగోపాలస్వామి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

బొబ్బిలి: బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ దంపతులు శనివారం దర్శించుకున్నారు. బొబ్బిలిలో 3.20కోట్లతో నిర్మించనున్న జిప్లస్-4 కోర్టు భవనసముదాయానికి శ్రీనరసింహ దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు యు.దుర్గాప్రసాద్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ శంకుస్థాపన చేశారు. కోర్టు ప్రాంగణంలో శాస్త్రోక్తంగా ఏర్పాటుచేసిన యాగశాలలో పూర్ణకుంభాన్ని సమర్పించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.అనంతరం బార్‌అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాదులకు దిశానిర్దేశంచేశారు. బార్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంటి గోపాలకృష్ణశర్మ, తమ్మిరెడ్డి దామోదరరావు ఆధ్వర్యంలో బొబ్బిలిరాజుల చరిత్ర,నేపథ్యంపై ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను న్యాయమూర్తులు తిలకించారు. ఈ ప్రాంతానికి చెందిన యు.దుర్గాప్రసాద్ వారికి బొబ్బిలి చరిత్రను వివరించారు.శ్రీనరసింహ దంపతులు, ఠాకూర్‌లను న్యాయవాదులు సన్మానించారు. అనంతరం బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయంలో లాంఛనాలతో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ప్రాశస్త్యాన్ని న్యాయమూర్తులకు వివరించారు. విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలి

సీనియర్ న్యాయవాదులు జూనియర్లకు మంచి మార్గదర్శకులుగా నిలవాలని హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ తెలిపారు. బొబ్బిలిలో అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ అధ్యక్షతనఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం, బొబ్బిలి, చినమేరంగి తదితర ప్రాంతాలు పూర్వం రాజుల పాలనలో ఉండేవని తెలిపారు. ఎస్టేట్‌అబాలిస్ యాక్టు తదితర చట్టాల ప్రభావంగా సివిల్ లిటిగేషన్లు ఎక్కువగాఉన్నాయని, ఈప్రాంతంలో న్యాయ అవసరాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం శ్రీరామ్, జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటి గోపాలకృష్ణశర్మ ప్రసంగించారు.కార్యక్రమంలో ఎస్పీ దీపికా పాటిల్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, స్థానిక సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.వాసుదేవన్, న్యాయా ధికారులు సరోజనమ్మ, బార్‌ప్రతినిధులు తమ్మిరెడ్డి దామోదరరావు, సీనియర్ న్యాయవాదులు మత్స బెనర్జీ, అమరాపు రామకృష్ణ, మజ్జి జగన్నాథం, చందాన సూర్యనారాయణ, జాగారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



న్యాయమూర్తికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలుకుతున్న వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు

రేపు ఆటో, క్యాబ్‌ల డ్రైవర్ల ధర్నా

విజయనగరం దాసన్నపేట: ఆటో, క్యాబ్‌లపై ఈ-చలానా రద్దుచేయాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాకు జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ జగన్మోహన్‌రావు కోరారు.ఈ మేరకు శనివారం విజయనగరంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఆటో స్టాండ్ కార్మికులతో సమావేశం నిర్వహించి, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రామారావు, భాస్కరరావు, శ్రీను పాల్గొన్నారు.

1న శిక్షణ కోసం ఇంటర్వ్యూలు

రాజాం:రాజాంలోని జీఎంఆర్ నైరడ్‌లోఉచిత శిక్షణకు మార్చి ఒకటో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నైరడ్ పీవో కె.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్, కంప్యూటర్ బేసిక్స్, అండ్ టాలీ, హోం నర్సింగ్, పురుషులకు హౌస్ వైరింగ్, మొబైల్, బైక్, ఏసీ, ఫ్రిజ్ రిపేరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్‌కార్డు తీసుకుని ఆరోజు ఉదయం పది గంటలకు హాజరుకావాలని కోరారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9989953145. 9014716255 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మా మాట వినాల్సిందే

శృంగవరపుకోటరూరల్:మండలంలోని బొడ్డవరలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్వగృహంలో నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఆయనతో శనివారం సమావేశం నిర్వహించారు. పార్టీ మారుదామని ఆయనపై ఒత్తిడితెచ్చారు. ఎమ్మెల్యే టిక్కెట్టు ప్రకటించలేదని ప్రకటిస్తే తాము మాత్రం ఒడిస్తామని తెలిపారు. 'మీరు స్వతంత్ర అభ్యర్థిగాఉన్నా, కాంగ్రెస్‌లో ఉన్నా.. వైసీపీ ఉన్నా మీ వెంట మీమాట కాదనకుండా నడిచాం..గ్రామాల్లోనడిపించాం..ఇప్పుడు మాత్రం మీరు మా మాట కాదనకుండా వినాల్సిందే' అని కార్యకర్తలు పట్టుపట్టారు. కాగా ఈ విషయంపై ఎమ్మెల్సీ రఘురాజును ప్రశ్నించగా మాటకు విలువ ఇవ్వనిచోట ఉండొద్దని పార్టీ మారుదామని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వంగర:మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చిఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ కె.నారాయణ తెలిపారు. ఈకేంద్రంలో వంగర కేజీబీవీ, రేగిడి మోడల్ పాఠశాల, మడ్డవలస గురుకులంతో పాటు మడ్డువలస జీజేకాలేజీకి చెందిన విద్యార్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఇక్కడ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 276 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 258 మంది పరీక్ష రాయ నున్నట్లు చెప్పారు. శనివారం పరీక్షల నిర్వహణ గదులకు నిఘాకెమెరాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

వాలీబాల్ విజేత వీరఘట్టం

రేగిడి:మండలంలోని కొమిరలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో వీరఘట్టం విజయం సాధించింది. కొమిరలో విద్యాగణపతి, జ్ఞానసరస్వతిసహిత షిర్డీసాయి ఆలయప్రథమ వార్షికోత్సవంలో భాగంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర వాలీబాల్, ఇతర క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి.వాలీబాల్ పోటీల్లో 35 జట్లు పాల్గొనగా ఫైనల్‌కు వీరఘట్టం, తెట్టింగి జట్లు చేరాయి. ఈమేరకు నిర్వహించిన ఫైనల్ పోటీల్లో వీరఘట్టం విజేతగా నిలిచింది. అలాగే జిల్లాస్థాయి షటిల్‌పోటీల్లో 30జట్లు పాల్గొనగా పాల కొండ జట్టు విజయం సాధించింది. కాగా ఆలయ వార్షికోత్సవం చివరిరోజు బాబాకు అభిషేకాలు, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి అర్చకులు అరవల్లి నరసింహశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జామి: మండలంలోని లోట్లపల్లి, అన్నంరాజుపేట, ఎంకేవలస, కొత్తభీమసింగి, రామయ్యపాలెంలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాంబాయ్ శనివారం పరిశీలించారు.కార్యక్రమంలో ఎస్ఐ వీరబాబు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి న్యాయంచేయాలి

రాజాం రూరల్:పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన రైతు శుభకరణ్ సింగ్ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు డిమాండ్‌చేశారు.రాజాంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అన్నదాతను పొట్టన పెట్టుకున్న బీజేపీకి చెందిన హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్.కట్టర్,కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నైతికబాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు కంచినాయుడు, తవిటినాయుడు, శ్రీనివాసరావు, పోలినాయుడు పాల్గొన్నారు.

'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్ ఆవిష్కరణ



ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు పొందిన ఓటర్ల కోసం టీడీపీ ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. ఈమేరకు శనివారం విజయనగరంలో స్థానిక టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు, పార్టీ నియోజకవర్గ నాయకులు, కొత్త ఓటర్లతో కలిసి 'ఫస్ట్‌ఓట్ ఫర్‌సీబీఎన్' పేరిట నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులు, యువతను ప్రభుత్వం మోసం చేసిందని, ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ ప్రకటనచేసి, తీరా గద్దెనెక్కాక జాబ్ విడుదలచేయలేదని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో 20 లక్షల ఉద్యోగాలే కల్పనగా చంద్రబాబు హామీఇచ్చారని తెలిపారు. నిరుద్యోగులు, యువత రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

రాజాం రూరల్: వచ్చేనెల తొమ్మిదో తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాబు పిలుపునిచ్చారు. రాజాంలోని తన చాంబర్‌లో జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణ సాయితేజతో కలిసి శనివారం పోలీస్, రెవెన్యూ, బ్యాంకింగ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులు ఎక్కువగా రాజీ అయ్యేందుకు కృషిచేయాలని కోరారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ మహేందర్, రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు, రాజాం తహసీల్దార్ కృష్ణంరాజు, సంతకవిటి డిప్యూటీ తహసీల్దార్ రంజిత్‌కుమార్, రాజాం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, రేగిడి ఎస్ఐ శ్రీనివాసరావు, ఏజీపీ శెట్టి పోలారావు, పలు బ్యాంకుల అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్, రెవెన్యూ సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

స్త్రీలను వేధిస్తే కఠిన చర్యలు

రాజాం రూరల్:పనిచేసే ప్రదేశాల్లో స్త్రీలను వేధింపులకు గురిచేస్తే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని రాజాం సీనియర్ సివిల్ న్యాయాధికార్లి ఎం.బాబు హెచ్చరించారు. స్త్రీలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలిపారు.రాజాంలోని కోర్టు ఆవరణలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ లింగవివక్ష చట్టరీత్యా నేరమన్నారు. ఇబ్బందికర పరిస్థితులు ఎదురైన స్త్రీలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ, న్యాయవాదులు పాల్గొన్నారు.

కేఏ నాయుడు, బంగార్రాజుకు చంద్రబాబు పిలుపు

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/నెల్లిమర్ల: గజపతినగరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా కొండపల్లి శ్రీనివాస్ పేరును పార్టీ అధినేత చంద్రబాబు శనివారం ప్రకటించారు. ఈనేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కేఏ నాయుడుకు చంద్రబాబు నుంచి పిలుపువచ్చింది. పార్టీ ఇన్‌చార్జితోపాటు ఇతర పదవులకు రాజీనామాపై వెనక్కు తగ్గినట్లు తెలిసింది. ఈసందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కేఏ నాయుడు అసంతృప్తి వ్యక్తంచేశారు. నెల్లిమర్ల నియోజకవర్గ టిక్కెట్ జనసేనకు కేటాయించడంతో టీడీపీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తంచేశాయి.ఈనేపథ్యంలో ఈ విషయం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజుకు ఫోన్‌చేసి, అమరావతి రావాలని కోరారు.

అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోను: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్: 'జిందాల్ కంపెనీ వస్తుందని నామాట నమ్మి భూములు ఇచ్చిన మీకు ఆన్యాయం జరుగుతుంటే చూస్తు ఊరు కోలేనని, మీకు అండగా నిలవాల్సిన బాధ్యత నాకు ఉందని, మీకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానని ఆ బాధ్యత నాకు ఉందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. శనివారం కిల్లంపాలెంలో జిందాల్ భూనిర్వాసితులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఆ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు గురించి రైతులకు మాట మాత్రం చెప్పకపోవడం దారుణమన్నారు. సోమవారం గ్రీవెన్స్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇద్దామని తీర్మానించారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

విజయనగరం దాసన్నపేట: మెడికల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం ఆగదని ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రకాష్ అన్నారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కార్మికులతో కలిసి మోకాళ్లపై నిల్చొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మిక శ్రమను కాంట్రాక్టర్లు దోపీడీ చేస్తున్నారని, వారికి మెడికల్ అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రంగరాజు, రాములు, బంగారు నాయుడుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ప్రజ్ఞా వికాస పరీక్ష విజేతలకు బహుమతులు

శృంగవరపుకోట: ఎస్.కోటలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞావికాస పరీక్ష విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. భార్గవి, జగదీష్, ప్రసాద్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు హర్ష, జయ, కల్యాణి, భారతి, చరణ్, చైతన్య, రోహిత్, రాము, నాయుడు, రుషి పాల్గొన్నారు.

గాయత్రీ ధ్యాన మందిరంలో 12వ వార్షికోత్సవం

రాజాం: మునిసిపాలిటీలోని మల్లిఖార్జునకాలనీలో గల గాయత్రీ ధ్యాన మందిరంలో 12వ వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లలిత సహస్రనామ స్తోత్రం, సామూహిక కుంకుమ పూజలు చేశారు.ఆలయ నిర్వాహకుడు జాడ రామవెంకట సుబ్రహ్మణ్యంశర్మ, అర్చకులు రంపా సంతోష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పూజలు జరుగుతున్నాయి.

మహానుభావుల జీవితాలు ఆదర్శం కావాలి

రేగిడి:శ్రీరాముడు,భీష్ముడు, ఛత్రపతి శివాజీ వంటి మహానుభావుల జీవితాలు ఆదర్శంకావాలని ఏలూరు జిల్లా ముందూరుపీఠాధిపతి, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అభినవ వివేకనంద శ్రీకృష్ణ చరణానంద భారతీ స్వామిజీ తెలిపారు.శనివారం రేగిడిదత్తపీఠంలో దత్తగురువు కిమిడి సత్యనారాయణ అధ్యక్షతన దత్తజ్ఞానబోధ సభ నిర్వహించారు.కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు, విద్వాన్ జడ్డు జగ్గారావు, తారాకానంద స్వామీజి, ఆధ్యాత్మికవేత్తఎస్వీ రమణ, భాస్కరరావు, బొరోతు శంకరరావు, కుదుతుల మురళి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై మొగ్గు

● టీడీపీ నేతలు విజయచంద్ర, బేబీ నాయన


మాట్లాడుతున్న విజయచంద్ర, బేబీ నాయన

సీతానగరం: చంద్రబాబు ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని టీడీపీ బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బేబీ నాయన, బోనెల విజయచంద్ర అన్నారు. బగ్గందరవలస గ్రామంలో శనివారం వారు పర్యటించి, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈసందర్భంగా మహిళాశక్తి పేరుతో ప్రవేశపెట్టనున్న సూపర్‌సిక్స్ పథకాలపై మహిళలకు వివరించారు. అనంతరం తిరుపతినారాయణరావు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బొమ్మినాయిని లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్‌నాయుడు, గొట్టాపు రామారావు, పైల నాగభూషణరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం చూపాలి


డంపింగ్‌యార్డు సమస్యపై ప్రశ్నిస్తున్న మన్మథరావు

పాలకొండ: నగర పంచాయతీ నుంచి సేకరించిన చెత్తను తరలించేందుకు శాశ్వత ప్రాతిపదికన డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయాలని నగర పంచాయతీ కౌన్సిలర్ వెలమల మన్మథరావు కోరారు. శనివారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి ఆధ్వర్యంలో చేపట్టిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పట్టణంలోని 1, 2, 20 వార్డులకు సంబంధించిన శివారు ప్రాంతాల్లో నగర పంచాయతీలోని చెత్తా చెదారాలను తరలించి డంప్ చేయడం ద్వారా ఆయా వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు. దీనిపై ఇంతవరకు తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పాలని కమిషనర్ సర్వేశ్వరరావును ప్రశ్నించారు. టీడీపారాపురం గ్రామం వద్ద డంపింగ్‌యార్డు స్థలం వివాదంలో ఉందని, డంపింగ్‌యార్డుకు ప్రత్యేక స్థలం కేటాయించాలని సూచించారు. పట్టణంలో వీధి లైట్లు నిర్వహణ, పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని, ప్రత్యేక దృష్టిసారించాలని మరో కౌన్సిలర్ కొరికాన గంగునాయుడు కోరారు. దీనిపై పర్యవేక్షణ చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా సాగునీటి సరఫరాకు ఐదు లక్షల రూపాయలు మేరకు నిధులు కేటాయిస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. దీనిపై స్పందించిన వైసీపీ కౌన్సిలర్ మన్మథరావు ప్రతిఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ట్యాంకులకు అయ్యే ఖర్చును ఒకేసారి కొనుగోలు చేసి దుబారాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్ ఉన్నారు.

ధాన్యం సేకరణ పూర్తి చేశాం

● జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగేశ్వరరావు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ సి.విష్ణుచరణ్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన జిల్లా వ్యవసాయ సలహా మండలి చక్కగా పనిచేసిందన్నారు. జేసీ మాట్లాడుతూ మండల, జిల్లా స్థాయిలో చర్చించిన అంశాల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ వ్యవసాయ నివేదికను సమర్పిస్తూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ప్రవేశపెడుతున్నారని చెప్పారు. రబీ-23 సీజన్‌లో 70,588 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికిగాను నేటివరకు 31,605 ఎకరాల్లో రబీ పంటల సాగు చేపట్టామన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో 1,39,505 రైతు కుటుంబాలకు రూ.689.5 కోట్లు 13 విడతలుగా జమ చేశామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 21,384 మంది ఆర్ఓఎఫ్ఆర్ రైతులకుగాను 12,480 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేశామని, మిగిలిన 8,904 మంది రైతులకు మరో వారం రోజుల్లోగానే ఈకేవైసీ పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ దేవుళ్ల నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య, జిల్లా ఉద్యాన అధికారి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

చీపురుపల్లి: ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, తల్లిదండ్రుల సహకారంతోనే బాల్య వివాహాలను అరికట్టడం సాధ్యమవుతుందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన డివిజన్ స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టడానికి పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ అధికారులు, వెలుగు, రాజకీయ నాయకులు, మీడియా సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యుడు సీతారాం, జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి బి.శాంతకుమారి, చీపురుపల్లి, గరివిడి, రాజాం సీడీపీవోలు ఎస్.రాజరాజేశ్వరి, ఎన్.ఆరుద్ర, కనకదుర్గ, చీపురుపల్లి ఎంపీడీవో డి.శ్వేత, తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, ఏపీఎం రాజశేఖర్, డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'కు సిద్ధం కావాలి

కొత్తవలస: వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో గల వైద్య సిబ్బంది మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమానికి సిద్ధంకావాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలో గలన వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీ, ఆశావర్కర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

గిరిజనుల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదు

సాలూరు రూరల్: భూపట్టాల విషయంలో గిరిజనుల మధ్య రెవెన్యూ అధికారులు తగాదాలు సృష్టించడం సరికాదని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా నేత కొయ్యాన శ్రీనివాసరావు అన్నారు. భూపట్టాల కోసం బొర్రపణుకువలస, జిల్లేడువలస గిరిజనులు నాలుగో రోజు శనివారం నిరసన దీక్ష చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అటవీ హక్కుల పట్టాల కోసం గిరిజనుల మధ్య సఖ్యతను దెబ్బతీసే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు సమంజసం కాదన్నారు. దీక్షలు చేస్తున్న గిరిజనులకు న్యాయం చేయడానికి గిరిజన మంత్రి జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మర్రి శ్రీనివాసరావు, సుందరరావు పాల్గొన్నారు.

విలేకర్లపై దాడులను అరికట్టాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: ఇటీవల రాష్ట్రంలో పలు చోట్ల విలేకర్లపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ శివ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఏజెన్సీ ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు పి.కొండలరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, కుమారస్వామి మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల పలుచోట్ల విలేకర్లపై అకారణంగా దాడులు జరిగాయని, వీటిని రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు తీవ్రంగా ఖండించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు వి.ఏ.నాయుడు, పెంటయ్య, శ్రీనివాసరావు, తుంబలి వినోద్, కె.రాజా, తూలుగు రవికుమార్, కారంగి వెంకటరావు, ప్రకాష్, ఏ.ఎస్.ఎం.రాజు, రవికుమార్ పండా, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతోనే విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మక్కువ: సాలూరు పట్టణంలోగల 132/33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో 10/16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అధిక సామర్థ్యంగల 31.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడం వల్ల గత రెండు రోజులు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడిందని విద్యుత్తు శాఖ ఈఈ వీవీ కిషోర్ తెలిపారు. స్థానిక సబ్‌స్టేషన్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కువ, పాచిపెంట విద్యుత్తు ఉపకేంద్రాల్లో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని, వీటిని వచ్చే మార్చి నెలలో అందుబాటులోకి తెచ్చి మెరుగైన విద్యుత్తు సరఫరాను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ లక్ష్మణరావు, విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: ఇటీవల కాలంలో ఉపాధ్యాయ, ఉద్యోగ నియామక పరీక్షల కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఐదో షెడ్యూల్‌లో ఉన్న ఆదివాసీలకు అన్యాయం జరిగిందని, ఈ మేరకు గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీని ఏర్పాటు చేయాలని టీఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణ కోరారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ డీఎస్సీపై పునరాలోచన చేసి ప్రత్యేక గిరిజన డీఎస్సీ ప్రకటన ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఈనెల 26న ఉదయం 9 గంటలకు చలో కలెక్టరేట్ ఉందని, ఈ కార్యక్రమాన్ని ప్రతి నిరుద్యోగ గిరిజన యువత హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జియ్యమ్మవలస: విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీకటి శంకరరావు అన్నారు. శనివారం అప్పన్నదొరవలస గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టడంతో పాటు సూచనలు అందించారు. వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పరచండి

● డీఈవో ప్రేమ్‌కుమార్


విద్యార్థినితో చదివిస్తున్న డీఈవో

బొండపల్లి: విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. రోల్లవాక ఎంపీపీ పాఠశాలతో పాటు గొట్లాంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం తనిఖీచేశారు. రోళ్లవాక పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. అనంతరం గొట్లాంలో మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ పక్కాగా అమలుచేయాలని, ఎండీఎంను పర్యవేక్షించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 అల్లు వెంకటరమణ, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరామాచారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జునరావు

కొమరాడ: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ శ్యామల అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తీసుకుంటున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటికే బోర్లు మరమ్మతులకు సంబంధించిన విడి భాగాలను తెప్పించామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొండచీపుర్ల తయారీపై శిక్షణ

కొమరాడ: పెదశేఖ గ్రామ వీడీవీకే ద్వారా మహిళలకు అందిస్తున్న కొండ చీపుర్ల శిక్షణ కార్యక్రమాన్ని వెలుగు ఏపీడీ సత్యంనాయుడు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ ఆదేశాల మేరకు 50 మందికి శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. శిక్షణ ద్వారా నాణ్యమైన కొండచీపుర్లు మార్కెట్లోకి రావడంతో పాటు మంచి లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాణి రత్నకుమారి, ఎఫ్‌పీవో సీసీ ఈశ్వరమ్మ, జనరల్ సీసీ గణేష్‌కుమార్, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక

చీపురుపల్లి: పట్టణంలోని రామాంజనేయ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆరిక రోహిత్ నేషనల్ మీన్స్ అండ్ మెరిట్స్ ఉపకార వేతనానికి ఎంపికయ్యాడు. ఈ ఉపకార వేతనం కింద విద్యార్థికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకూ నెలకు రూ.1,200 వంతున నాలుగేళ్ల పాటు ఆర్థిక సహకారాన్ని అందజేస్తారు. ఈసందర్భంగా రోహిత్‌ను చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి, పాఠశాల హెచ్‌ఎం కంది గోపి, పి.తిరుపతిరాజు, శ్రీరాములు, శ్రీను తదితరులు అభినందించారు.

పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

చీపురుల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి శ్రీనివాసరావు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అందవరపు హరి, పొట్నూరు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఇచ్చే ఆహార పదార్థాలు తాజాగా ఉండాలి


జైలులో వంట గదిని పరిశీలిస్తున్న న్యాయాధికారి

పాలకొండ: రిమాండ్ ఖైదీలకు జైల్లో అందిస్తున్న ఆహార పదార్థాలు తాజాగా ఉండాలని పాలకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.విజయరాజ్ కుమార్ అన్నారు. పాలకొండ సబ్‌జైలును ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. అనంతరం కిచెన్ రూమ్‌లోకి వెళ్లి ఖైదీల కోసం తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. రేషన్, బియ్యం, పప్పులు తదితర వంట సామగ్రిని తనిఖీ చేశారు. జైలు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని జైలు సూపరింటెండెంట్ జోగులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు హెడ్ వార్డెన్స్ పి.చంద్రరావు, విజయకుమార్, వార్డెన్స్ మధు, నాగరాజు, కోర్టు సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ కిరణ్మయిలతో పాటు న్యాయవాదులు నాయుడు, రఘు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలుతో డబ్బులు ఆదా

సీతానగరం: మండలంలో గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమ్మకాలు చేపడుతున్న అటవీ ఉత్పత్తులను నేరుగా కొనుగోలు చేసుకుంటే నాణ్యమైన వస్తువులతో పాటు డబ్బులు ఆదా అవుతాయని వెలుగు పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాలు మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జీసీసీ అమ్మకాలు చేపడుతున్న పసుపు, చింతపండు, కొండచీపుర్లు వస్తువుల ప్రదర్శనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీరాములనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశాలకు గైర్హాజరు కావద్దు

బొండపల్లి: ప్రతివారం మండల స్థాయి అధికారులతో నిర్వహించే సమీక్షా సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని మండల ప్రత్యేకాధికారి ఎన్‌వీకే.దుర్గాప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో అభివృద్ధి పనులు, ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో వారందరికీ మెమోలు ఇవ్వాలని ఎంపీడీవోకు సూచించారు. అలాగే మార్చి 1వ తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.హరిహరరావు, అధికారులు పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్ స్తంభం ఏర్పాటు


సెంటర్ లైటింగ్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని నాలుగు రోడ్ల వద్దగల సెంటర్ లైటింగ్ స్తంభం ఏర్పాటుకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. పది రోజుల కిందట నాలుగు రోడ్ల కూడలి వద్దగల సెంటర్ లైటింగ్ స్తంభాన్ని లారీ ఢీకొట్టడంతో ప్రధాన రహదారిపై పడిపోయింది. దీంతో కూడలి వద్ద చీకట్లు అలముకున్నాయి. అలాగే ప్రధాన రహదారిలో వెళ్లి వారికి స్తంభం అడ్డుగా ఉండడంతో ఇబ్బందిగా మారింది. ఈ మేరకు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు ఇంజినీరింగ్ అధికారులు స్పందించా రు. స్తంభాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులతో పాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఒడిశా

పశువుల వాహనం బోల్తా.. గేదె మృతి

రాయగడ: మునిగుడ సమితి సనదడ గ్రామ సమీపంలో వంశధార వంతెన దగ్గర పశువులను తరలిస్తున్న ఓ మినీ వ్యాను బోల్తా పడిన ఘటనలో ఓ గేదె మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మునిగుడ సమితి జగదల్‌పూర్ పంచాయతీ పరిధి గడంగా గ్రామవాసి బృందాకు చెందిన నాలుగు గేదెలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ మినీ వ్యానులో ఎక్కించుకుని ఉడాయించారు. గేదెలను తరలిస్తున్న వ్యాను ప్రమాదానికి గురవడంతో ఈ విషయం వెలుగుచూసింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహన చోదకుడు పరారయ్యాడు. బాధితుడు బృందా మాట్లాడుతూ ప్రతిరోజులా ఇంటి ముందు గేదెలను కట్టానన్నారు. వేకువ ఝామున పాలు తీసేందుకు లేచి చూడగా గేదెలు కనిపించలేదని దీంతో వెతకడం మొదలు పెట్టానని తెలిపారు. గేదెలను తరలిస్తున్న వ్యాను ప్రమాదానికి గురై గేదె చనిపోయినట్లు తెలుసుకుని వచ్చానని, ఇక్కడకు వచ్చాక అవి తన గేదెలే అని తెలిసిందన్నారు. గేదెలను ఎవరు దొంగలించారో తెలియరాలేదు. మునిగుడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నుల పండువగా కలశ యాత్ర


కలశ యాత్రలో పాల్గొన్న భక్తులు

రాయగడ: అమలాపేట గ్రామంలో ఈనెల 29న జిల్లాలో తొలిసారిగా శ్రీ లక్ష్మీనర సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఇందులో భాగంగా శాస్త్రోక్త పూజలు శనివా రం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందుకోసం వందల సంఖ్యలో మహిళల పవిత్ర నాగావళి నది నుంచి కళశాలతో నదీ జలాలను తీసుకుని కలశ యాత్ర నిర్వహించా రు. జేకే పూర్ బాలాజీ మందిరం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేరకు యాత్రగా వెళ్లి ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజూ జనతా దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పూర్వ రాజ్యసభ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు పాల్గొన్నారు.

పట్టు సడలని ఆశయంతో ముందుకు సాగాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

రాయగడ: విద్యార్థులు పట్టు సడలని ఆశయంతో ముందుకు సాగాలని వాకర్ నీలం సాహు అన్నారు. స్థానిక లొండప హాడ్‌పై ఉన్న సామాజిక హాలులో హైకర్స్‌క్లబ్ సభ్యులు యువతకు ఓ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో యువత ఎంతటి క్లిష్ట సమస్యనైనా ఎదుర్కొని నిబ్బరంగా నిలబడగలిగేలా ఉండాలన్నారు. ముఖ్య అతిథులుగా వాకర్ సత్యవాది పతి, అభిమన్యులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన క్విజ్‌పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైకర్స్ క్లబ్ అధ్యక్షుడు వంశీ కీర్తి, ఉపాధ్యక్షుడు శ్రీవాత్సవ్, కార్యదర్శి బి.అవంతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో న్యాయ అవగాహన శిబిరం


మాట్లాడుతున్న పండా

రాయగడ: కొత్తపేట పంచాయతీలో శుక్రవారం సాయంత్రం జిల్లా లీగల్ సెల్ అథారటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారటీ కార్యదర్శి నివేదిత పండా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత, మోటారు వాహన చట్టాలపై చర్చించారు. రోడ్డు ప్రమాద బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం సకాలంలో చెల్లించాలని హైకోర్టు నిర్దేశించిన ఆదేశాలపై చర్చించారు. కార్యక్రమంలో అదనపు కార్మిక శాఖ అధికారి గోపాలకృష్ణ మంగరాజ్, జిల్లా రవాణాశాఖాధికారి శివశంకర్ చౌదరి, న్యాయవాదులు రామ్‌ప్రసాద్ పాత్ర, సీతారాం పండా, కిషోర్‌సాహు, కొత్తపేట సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

గరుగుబిల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ వై.అమ్మన్నరావు హెచ్చరించారు. ఉల్లిభద్ర, గరుగుబిల్లి, దళాయివలస ప్రాంతాల్లో శనివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతుందన్నారు. ఆరుబయట మద్యం తాగినా చర్యలు తప్పవన్నారు.

ఆర్టీసీ డిపోలో నేత్ర పరీక్షలు

సాలూరు రూరల్: సాలూరు ఆర్టీసీ డిపోలో మేనేజర్ ఎ.భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం శంకర్ ఫౌండేషన్ సహకారంతో నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లుకు నేత్ర వైద్యురాలు వి.అనూష నేత్ర పరీక్షలు నిర్వహించారు. 80 మందికి తనిఖీలు నిర్వహించగా, వారిలో నలుగురికి కేటరాక్ట్ సమస్య, ఒకరికి రెటీనా సమస్య ఉన్నట్టు గుర్తించారు. వారిని చికిత్స కోసం రిఫర్ చేశారు.

పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

సీతంపేట: సీతంపేట పోలీసుల ఆధ్వర్యంలో కుశిమి వారపు సంతలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మంది రోగులకు వైద్య సేవలు అందించారని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం వృద్ధులకు గొడుగులు, దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సీఐ చంద్రమౌళి, ఎస్ఐ జగదీష్‌నాయుడు, ఎంపీడీవో గీతాంజలి పాల్గొన్నారు.

జగదీశ్వరికి అభినందన


జగదీశ్వరికి మిఠాయిలు తినిపిస్తున్న టీడీపీ నాయకులు

కొమరాడ: టీడీపీ కురుపాం నియోజకవర్గ టికెట్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరికి కేటాయిస్తున్నట్టు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు శనివారం ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. నిజమైన గిరిజన బిడ్డకు టికెట్టు కేటాయించడం హర్షణీయమని పార్టీ మండల కన్వీనర్ ఉదయశేఖర్‌పాత్రుడు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆమె నివాసానికి వెళ్లి అభినందించారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: ఖడ్గవలస సముదాయంలో శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో పాలభిషేకం చేశారు. కురుపాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా తోయక జగదీశ్వరిని ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశామని చెప్పారు. టీడీపీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, జి.సుదర్శనరావు, ఎ.తవిటినాయుడు, ఎం.కృష్ణంనాయుడు, ఎం.సింహాచలంనాయుడు, ఎస్.మధుసూదనరావు, పి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రామతీర్థం కోనేరులో చక్రస్నానం


స్వామివారికి చక్రస్నానం చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: రామతీర్థంలోని రామస్వామి దేవస్థానం కోనేరులో శనివారం ఆలయ అర్చకులు స్వామివారి చక్రస్నానం నిర్వహించారు. అంతకుముందు దేవాలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉమా కోటిలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన

శృంగవరపుకోట: పుణ్యగిరిలోని ఉమా కోటిలింగేశ్వర స్వామికి శనివారం ప్రధానఅర్చకుడు లట్టాల మణిశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష బిల్వార్చన, ఉమా కోటి లింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, చైర్మన్ పొలమరశెట్టి, రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం కొండపై అన్నసమారాధన నిర్వహించారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ

మక్కువ: ములక్కాయవలస గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా శనివారం స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల వీణ, ఎన్ఎస్ఎస్ పీవో ఎం.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

సాలూరు రూరల్: మండలంలోని ఎం.పద్మ, ఎర్ర అప్పలనాయుడు అనే రెండు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.3.47లక్షలు మంజూరు కాగా, ఆ చెక్కులను డిప్యూటీ సీఎం రాజన్నదొర శనివారం సాలూరులో అందజే శారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పలనాయుడు, తదితరు లు పాల్గొన్నారు. ● **పాలకొండ:** వీరఘట్టం మండలం పనస నందివాడ గ్రామానికి చెందిన దమర సింగి గారయ్య కు ఇటీవల బ్రెయిన్ సర్జరీ జరిగింది. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.20 లక్షలు మంజూరయ్యింది. ఈ చెక్కును శనివారం ఎమ్మెల్సీ విక్రాంత్‌తో పాటు వైసీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం బాధితుడికి అందజేశారు. ● **వీరఘట్టం:** బిటివాడ గ్రామానికి చెందిన శొంఠ్యాన నరసింహారావు ఇటీవల కన్నుమూశా రు. ఈ మేరకు సీఎం సహాయ నిధి రూ.40 వేలు మంజూరయ్యింది. ఈ చెక్కును వండువ గ్రామంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి.. నరసింహారావు కుటుం బ సభ్యులకు శనివారం అందించారు.